మత్తుపదార్థాలు అమ్మినా, కొన్నా చర్యలు తప్పవు


గోపాల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

మలక్‌పేట: మత్తు పదార్థాలు అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తప్పవని మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా మద్యం అమ్మకాలపై గట్టి నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు. డ్రగ్స్, హెరాయిన్, ఎల్ఎస్‌డీ, కొకాయిన్, బ్రౌన్ షుగర్, ఎన్‌డీపీఎల్ లిక్కర్, గంజాయి, నాటు సారా అమ్మినా నిల్వ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే 87126 59641 నంబర్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

సీ గ్రేడ్-1 అధికారిగా నర్సింహారెడ్డి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సీ గ్రేడ్-1 అధికారిగా చిలుకా నర్సింహారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

నాగోలు: తల్లిపాలే పిల్లలకు ఆరోగ్యమని ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ గొంగలయ్య అన్నారు.నాగోలు డివిజన్ పరిధి జైపురికాలనీ బ్లెండ్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం రామాంతాపూర్ సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు నవజాత శిశువులను అంటువ్యాధుల బారి నుంచి రక్షిస్తాయన్నారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని బిడ్డపుట్టిన గంటలోపే తాగించాలన్నారు. ముర్రు పాలు తాగడంతో చిన్నారులకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లలిత, మేఘమాల, కావేరి, కల్యాణి, ఎస్‌హెచ్‌జీ సభ్యులు వరలక్ష్మి, ఉమా, జ్యోతి, సునిత, ఉమ, శారద, సుమ, జ్యోతి పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతోనే పడకేసిన పారిశుద్ధ్యం

చంపాపేట: శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే కాలనీల్లో పారిశుద్ధ్యం పడకేసిందని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి ఆరోపించారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు శనివారం ఆయన తన కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం కాలనీ అంతర్గత రహదారులను శుభ్రం చేయాల్సి ఉండగా కొందరు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వారిని గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఈ వెంకటేష్, జవాన్లు నర్సింహా, సురేష్, యాదగిరి, శరత్‌బాబు, సంతోష్ పాల్గొన్నారు.

కాలనీలలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తా

ఎల్బీనగర్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యను పరిష్కరిస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పోలీస్‌కాలనీ, సాహెబ్‌నగర్ వీకర్‌సెక్షన్ బస్తీల్లో శనివారం ఆయన ఎలక్ట్రికల్ ఏడీ రాంచంద్రయ్యతో కలిసి పర్యటిస్తూ మాట్లాడారు. బస్తీల్లో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే నూతన స్తంభాలు మంజూరు చేయించి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆయన వెంట విష్ణువర్ధన్‌రెడ్డి, అజయ్‌కుమార్, పెంటయ్య, లైన్‌మెన్ రామలక్ష్మణ్ పాల్గొన్నారు.

పాలస్తీనాకు అండగా నిలవాలి


సైదాబాద్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు, హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియే హత్య పట్ల ముస్లిం మహిళలు నిరసన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం సైదాబాద్ ఉజాలేషా మైదానానికి చిన్నారులతో కలిసి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇస్మాయిల్ హనియేకు నివాళులర్పించారు. అనంతరం ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా, పాలస్తీనాకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాలస్తీనాకు చెందిన అమాయకులను నిర్బంధించటం అమానుషమని వారికి అందరూ అండగా నిలవాలన్నారు. పాలస్తీనాపై తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న గాజా ప్రజలను అభినందించారు. మానవజాతిని వేదనకు గురి చేస్తున్న ఈ యుద్ధానికి వ్యతిరేకంగా అందరూ ఒకటి కావాలన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

ఇరువర్గాల ఘర్షణలో వ్యక్తిపై కత్తితో దాడి

నాగోలు: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి మామపై ఆమె సోదరుడు కత్తితో దాడి చేసిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భరత్‌నగర్ కాలనీలో పేజ్-2లో ఉండే ఓ మహిళ ఇంటికి అదే బస్తీలో ఉండే హనుమంతు శుక్రవారం రాత్రి వచ్చి ఆమె చేతులు పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. అదే సమయంలో హనుమంతు మామ రమావత్ శంకర్ నాయక్ అక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో ముగ్గురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇంట్లో ఉన్న సదరు మహిళ సోదరుడు దేవరాజు(26) వంటగదిలో ఉన్న కూరగాయల కత్తి తీసుకుని శంకర్‌నాయక్‌పై దాడి చేయగా మెడపై తీవ్ర రక్త గాయమైంది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్ తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. శంకర్‌నాయక్‌పై కత్తితో దాడిచేసిన దేవరాజును అరెస్టు చేశారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య


లాలస చందన (ఫైల్)

చైతన్యపురి: ఉరేసుకుని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. ఆర్టీసీ పికెట్ డిపోలో మేనేజర్‌గా విధులు నిర్వహించే రవీందర్ చిన్న కూతురు లాలస చందన (18)కు వరంగల్ ఎన్ఐటీలో బీ–టెక్ సీటు వచ్చింది. త్వరలో కాలేజీలో చేరాల్సి ఉంది. శనివారం సాయంత్రం లాలస చందన గదిలోకెళ్లి బయటకు రాలేదు. తల్లి తలుపు తట్టగా ఎలాంటి స్పందన లేదు. తలుపులను గట్టిగా తోసి లోపలికెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. ఎన్ఐటీలో చేరాల్సి ఉండగా అంతలోనే ఆత్మహత్య చేసుకోవటానికి గల కారణాలు తెలియరాలేదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. చదువు కోసం తల్లిదండ్రులకు దూరంగా ఉండాల్సి వస్తుందని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

నాగోలు: ఇంట్లో గొడవ పడి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, పెన్మిల్లా మండలం, ఎరత్వానిపల్లికి చెందిన చింతపల్లి మల్లయ్య (32) నాలుగేళ్ల క్రితం కృష్ణవేణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఎల్బీనగర్ గుంటి జంగయ్యకాలనీలో నివాసముంటూ మల్లయ్య కూలిపని చేస్తున్నాడు. ఆర్థిక విషయాలపై భార్యాభర్తల మధ్య గత నెల 17న గొడవ జరిగింది. కాసేపటి తర్వాత మల్లయ్య తన పల్సర్ బైక్ తీసుకుని బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కృష్ణవేణి, బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది

డ్రైనే ఛీ!

పొంగుతున్న డ్రైనేజీలు

రహదారులను ముంచెత్తుతున్న మురుగు
రాకపోకలకు ఇబ్బందులు
పట్టించుకోని అధికారులు


గడ్డిఅన్నారం డివిజన్ కోణార్క్ థియేటర్ రోడ్డులో పారుతున్న మురుగు


లలితానగర్ కాలనీ రోడ్డులో లీకేజీ అవుతున్న డ్రైనేజీ

చైతన్యపురి: అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థతో రోడ్లు, బస్తీల్లో మురుగునీరు ఏరులై పారుతోంది. చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్లలో పలు కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో ప్రజలకు నానా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ప్రభాత్‌నగర్ రోడ్డులో గంగా ఆసుపత్రి వద్ద డ్రైనేజీ పొంగుతుండటంతో ఆ దారంతా మురుగుమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పాదచారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత పైపులను తొలగించకపోవడంతోనే..

భవానీనగర్ కాలనీలోని భవాని మహిళా మండలి ముందు డ్రైనేజీ పైపులు పగిలిపోవటంతో మురుగు రోడ్డుపై పారుతూ రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక్కడ కొత్త సీసీ రోడ్డు వేసే సమయంలో పగిలిపోయిన భూగర్భ డ్రైనేజీ పైపులను మార్చకపోవడంతోనే సమస్య అలాగే ఉండిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు పగిలిపోయిన పైపులను మార్చాలంటే సీసీ రోడ్డు పగలగొట్టాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకే లీకేజీని అరికట్టడంలో సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గడ్డిఅన్నారం డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ మరింత ఘోరంగా ఉంది. కోణార్క్ థియేటర్ రోడ్డులో నిత్యం రోడ్డుపై మురుగు ప్రవహిస్తునే ఉంటుంది. ముసారాంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారం బస్తీలో డ్రైనేజీ పైపులు నిండి మురుగు గడ్డిఅన్నారం డివిజన్ లలితానగర్ కాలనీ రోడ్లపై ప్రవహిస్తుందని వెంటనే అధికారులు స్పందించి డ్రైనేజీ లీకేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



డివిజన్‌లోని పలు కాలనీలలో పాత కాలంనాటి డ్రైనేజీ వ్యవస్థ ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైపులైన్లను ఆధునీకరించి సమస్య పరిష్కరించాలని మెట్రో వాటర్ అధికారులకు విజ్ఞప్తి చేశాం. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించాలని కోరాం. నిధుల లేమితో పనులు జరగటం లేదు. మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం.

– రంగా నర్సింహగుప్తా, కార్పొరేటర్, చైతన్యపురి డివిజన్

బస్తీల్లోని రహదారులన్నీ ఆధునికీకరిస్తాం


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని బస్తీలలోని రహదారులు అన్నింటినీ ఆధునికీకరిస్తామని ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. చింతల్‌బస్తీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె బస్తీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పలుచోట్ల డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయని, అవి పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాలలోనూ సీసీ రోడ్లు వేస్తామన్నారు. తమ తమ బస్తీలలో జరిగే అభివృద్ధి పనుల్లో స్థానికులు సైతం భాగస్వాములవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, రేణుక, భారతి, వెంకటేష్, రవి, యాదయ్య పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.27, వంకాయ రూ.40, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.55, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.35, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.15, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.70, అర్వి రూ.40, మునగ రూ.45, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్ రూ.28, కీర రూ.28, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.47. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

బోనాలకు ఏర్పాట్లు పూర్తి

హయత్‌నగర్: నేడు హయత్‌నగర్‌లో నిర్వహించే బోనాల పండగకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తెలిపారు. పండుగ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించినట్లు పెద్దమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. కట్టమైసమ్మ దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆ ఆలయ కమిటీ అధ్యక్షులు లింగం బాబు తెలిపారు.

ఆలయాన్ని తీర్థ స్థలంగా తీర్చిదిద్దుదాం


లావణ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభ్యులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయాన్ని నగరానికే తలమానికంగా ప్రముఖ తీర్థ స్థలంగా తీర్చిదిద్దేందుకు పాలక మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది సహకరించాలని ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టిన లావణ్య కోరారు. శనివారం ఆమె పాలకమండలి సభ్యులతో కలిసి సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భక్తులు, దాతల సహాయ సహకారాలతో ఆలయంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పాలక మండలి సభ్యులు, అర్చకులు ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బబ్బూరి ఆనంద్‌గౌడ్, గోగిరెడ్డి అంజిరెడ్డి, చీర తిరుమలేష్, మేక సురేందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, గూడూరు మధుసూధన్‌రెడ్డి, కొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి ఠాణాను సందర్శించిన సీపీ


సూచనలు చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

చైతన్యపురి: రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు శనివారం రాత్రి చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల రికార్డులు పరిశీలించారు. రిసెప్షన్, పెట్రోలింగ్ సిబ్బంది వంటి పలు విభాగాల పనితీరు, సీసీ టీవీల నిర్వహణపై సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మహిళా భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీపీ వెంట డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య ఉన్నారు.

నాణ్యమైన భోజనం లేదంటూ ధర్నా


రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

చైతన్యపురి: నాణ్యమైన భోజనం అందించటం లేదని దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలోని ప్రభుత్వ బాలుర కళాశాల హాస్టల్ విద్యార్థులు శనివారం ధర్నాకు దిగారు. విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మహేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిధులు మంజూరు అవుతున్నా నాణ్యమైన ఆహారం అందించకపోవటం దురదృష్టకరం అన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఏబీవీపీ అండగా ఉంటుందన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వసతి గృహం పర్యవేక్షణ అధికారి సంజీవ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హనుమాన్, నాయకులు రాకేష్, సతీష్, విజయ్, అరవింద్, హేమంత్, శివ, కురుమూర్తి పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ హెల్ప్ డెస్క్ మూసివేత

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనం ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ జెండర్ హెల్ప్‌డెస్క్ కార్యాలయాన్ని మూసివేశారు. ట్రాన్స్‌జెండర్‌కు ఎలాంటి సమస్యలున్నా ఈ డెస్క్ ద్వారా చెప్పేవారు. ఇప్పుడు హెల్ప్‌డెస్క్ మూసివేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ట్రాన్స్‌జెండర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం


ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

మన్సూరాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. వర్గీకరణను హర్షిస్తూ మన్సూరాబాద్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సాయి ఆధ్వర్యంలో శనివారం ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేసి, ఎన్నో అవమానాలను తట్టుకుని మంద కృష్ణమాదిగ చివరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో వర్గీకరణను సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, జగన్, శ్రీను, ఎర్ర యాదయ్య, రవితేజ, భరత్, సిద్ధార్థ్, సంతోష్, రామేశ్వర్, సాయిరామ్‌గౌడ్, పాతూరి శ్రీధర్‌గౌడ్, జయతేజ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి



చైతన్యపురి: పర్యావరణ హితం కోసం మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ కాలనీలో నందు గణేష్ యువభక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే 39 అడుగుల మట్టి గణపతి నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వినాయక ప్రతిమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన రంగులతో తయారు చేసిన ప్రతిమలు నీటిలో కరగవని పురాతన సాంప్రదాయం ప్రకారం మట్టి వినాయకులనే పూజించాలన్నారు. నియోజకవర్గంలోని 934 కాలనీలలో సుమారు 90 వేల ఇళ్లలో మట్టి గణపతి ప్రతిమలను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, రమేష్ ముదిరాజ్, శ్రీశైలం యాదవ్, రవీందర్‌రెడ్డి, యాద శంకర్ పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు


వేడుకలను ప్రారంభిస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తోందని అనిబిసెంట్ మహిళా కళాశాల చైర్మన్ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన కొత్తపేటలోని జూనియర్ మహిళా కళాశాల ఫ్రెషర్స్ డేలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమదైన ముద్ర వేస్తున్నారన్నారు. విద్యార్థినులకు కళాశాల దశ ఎంతో ముఖ్యమని, ఈ దశలోని ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధన కోసం కష్టపడాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దయాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ సృజన, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

దిల్‌సుఖ్‌నగర్: ఈ నెల 9 నుంచి 15 వరకు ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాలను ప్రతి బంజారా, ఎరుకల, గిరిజన బస్తీల్లో జరుపుకోవాలని గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గోపీనాయక్, రంగారెడ్డి జిల్లా కమిటీ నాయకులు జగన్ నాయక్, శ్రీనునాయక్ పిలుపునిచ్చారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాల్లో రాజకీయాలకు అతీతంగా గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా వివక్ష చూపుతున్నాయని ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని సైతం పరిగణలోకి తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆగస్టు 9న జరుపుతున్న గిరిజన ప్రపంచ హక్కుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

సైదాబాద్: ఎగువ ప్రాంతాలు సహా సైదాబాద్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో వరద ముంపు సమస్య తలెత్తకుండా చేపట్టిన పనులను ముమ్మరంగా పూర్తి చేయాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఆమె వాటర్ వర్క్స్ అధికారులు, స్థానికులతో కలిసి శ్రీసాయిరాం కాలనీలో కొనసాగుతున్న వరద ముంపు నివారణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వరద నీరు సాఫీగా పారేందుకు గతంలో శ్రీసాయిరాం కాలనీలో నిర్మించిన పైప్‌లైన్ పలుచోట్ల శిథిలమవ్వడంతో వర్షాకాలంలో వరదనీరు బయటకు వచ్చి ముంపు సమస్య తలెత్తుతుందన్నారు. సమస్య పరిష్కారం కోసం నూతన పైప్‌లైన్లు వేస్తామన్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి


మహిళలతో మాట్లాడుతున్న సీడీపీఓ పావని

సైదాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలను బస్తీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ ప్రాజెక్ట్ సీడీపీఓ పావని సూచించారు. చార్మినార్ ప్రాజెక్ట్ నూతన సీడీపీఓగా శనివారం పావని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బస్తీ మహిళలతో సమావేశమై వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందిస్తారన్నారు. మహిళలు తమ చిన్నారులను నిత్యం ఈ కేంద్రాలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కోఆర్డినేటర్ ఎన్.శైలజ, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సుంచు పద్మిని, సహాయకురాలు సక్కు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

ఎల్బీనగర్/నాగోలు: కేరళలోని వయనాడ్ వరద బాధితులను అందుకోవాలని సీపీఐ సరూర్‌నగర్ సర్కిల్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ పిలుపునిచ్చారు. సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం వరద బాధితులకు సహాయం కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడిన సంఘటనలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు చేయూతనందించేందకు ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించి ఈ మూడ్రోజుల్లో సేకరించిన డబ్బులను జిల్లా పార్టీకి అందజేస్తామన్నారు. సుధాకర్, ఫైమీద, మదిలేటి, కమలమ్మ, పూజారి శ్రీను, అనిత, హేమలత, పార్వతమ్మ, చాంద్ బి, మంజు, నాగమ్మ పాల్గొన్నారు.

ఈ-పెట్టీ కేసుల్లో ముగ్గురికి జైలు

చంచల్‌గూడ: వివిధ నేరాల్లో మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ–పెట్టీ కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. నాగోల్‌కు చెందిన సాయిప్రసాద్ (30)కు ఏడు రోజులు, సైదాబాద్‌కు చెందిన మహ్మద్ షాబాజ్ (20), చంచల్‌గూడకు చెందిన మహ్మద్ సోహేల్(19)కు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ శనివారం నాంపల్లి 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్. సత్యనారాయణ తీర్పు ఇచ్చారు.

'గోరటి'కి మాల మహానాడు నాయకుల కృతజ్ఞతలు


ఎమ్మెల్సీ గోరటి వెంకన్నతో మాల మహానాడు నేతలు

ఎల్బీనగర్: శాసన మండలిలో జరిగిన చర్చలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఎస్సీ వర్గీకరణపై మాలల పక్షాన మాట్లాడినందుకు మాల మహానాడు నాయకులు శనివారం బీఎన్‌రెడ్డినగర్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పార్లమెంట్‌లో జరగాలని, ఒకవేళ జరిగిన రాజ్యాంగ పరిధిలో ఉండాలన్నారు. మాలలు, మాదిగల్లో ఉప కులాలు, అణగారిన వర్గాలకు సమాన వాటా దక్కాలన్నారు. మాల, మాదిగలను విడదీయడానికి అగ్రవర్ణాల వారు, మనువాదులు యత్నించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చేపూరి శంకర్, అంబేడ్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ కొంగరి నర్సింహారావు, జేఏసీ వైస్ చైర్మన్ గద్దె శ్రీనివాస్, పెరుమాళ్ల శంకరయ్య, పరిజాల రమేష్, ఆర్.కృష్ణ, శ్రీధర్, వాసుదేవరావు, నీలం కృష్ణ, చేపూరి నర్సింహ, శంకర్, నరేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, గాదరి లింగయ్య పాల్గొన్నారు.